# ఒకే రోజు ఆరు సాధారణ కాన్పులు

## స్టాఫ్ నర్స్‌ను అభినందించిన వైద్య బృందం

**అయిజ మార్చి 17, ప్రభాతవార్త;** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ జి. చంద్రకళ నేతృత్వంలో ఒకే రోజు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన గర్భిణీ స్త్రీలకు ఆరు సాధారణ కాన్పులను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాటా డుతూ డిఎంహెచ్ఓ, మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ ఆదేశానుసారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి గర్భిణీ స్త్రీలకు 99 శాతం నార్మల్ డెలివరీలు చేయాలి మిగిలిన 1 జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. ఉన్నతాధికారుల సలహాల సూచనలను మేరకే సాధారణ కాన్పులు చేయడం సాధ్యమైందని అన్నారు. ఈ విషయమై ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్, సిబ్బంది ఆమెను అభినందించారు. ఈ విషయం డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగన్న వైద్య సేవలకు ఇది నిదర్శన మని అన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య



ఆరుగురు శిశువులకు పురుడు పోసిన దృశ్యం

కేంద్రం నందు ప్రతి సంవత్సరం పెద్ద ఎత్తున నార్మల్ డెలివరీలు మా సిబ్బంది చేస్తున్నారు. జిల్లాలోనే ఎన్నోసార్లు ముందుండి అవార్డులు అందుకున్నారని గుర్తు చేశారు.


మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

# మెనూను వంద శాతం అమలు చేయాలి

## నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**నారాయణపేట, మార్చి 17 ప్రభాతవార్త :** మధ్యాహ్న భోజన పథకం మెనూను వంద శాతం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. భోజనానికి వినియోగించే బియ్యం మరియు ఇతర సరకులు నాణ్యతతో ఉండాలని సూచించారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి గూగుల్ మీట్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17 నుంచి 21 లోపు నోడల్ అధికారులు పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. గడువులోపు పర్యటనలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో అధికారుల బృందం ఏర్పాటు చేసి వారానికి రెండుసార్లు పాఠశాలలు తనిఖీ చేయాలని చెప్పారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యత, రుచిని పరిశీలించాలని సూచించారు. ప్రహరీలు లేని పాఠశాలల –మిగతా4లో..

# కొండారెడ్డిపల్లి పనులపై ఫోకస్ పెంచాలి

## కొండారెడ్డిపల్లి అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షా

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం అచ్చంపేట నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లి లో జరుగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జీవి శ్యామ్ ప్రసాద్ లాల్, జిల్లా పరిషత్ సీఈఓ, కొండారెడ్డిపల్లి అభివృద్ధి పనుల ప్రత్యేక అధికారి దేవ సహాయంలతో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం కలెక్టరేట్ లోని తన చాంబర్లో సాయంత్రం సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీ త గడువులోగా పనులన్నింటిని అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ నిర్దేశిత సమయంలో గ్రామంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వ ర్యంలో మంజూరు చేసి చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయా లని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అంతకుముందు, గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా మంజూరైన అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్స్ ఏటిసీ సెంటర్ పాలిటెక్నిక్ కళాశాలకు అవసరమైన 5 ఎకరాల భూమిని వెంటనే నిర్మాణ పనులకు అప్పజెప్పాలని, వంగూరు తహసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో శిథిల వ్యవస్థ లో ఉన్న పాఠశాలను డిస్మెంటేషన్ ప్రక్రియను పూర్తి చేసి పాఠశాల – మిగతా4లో..




సిలిండర్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

# ముమ్మర తనిఖీలు..

## పదుల సంఖ్యలో పట్టుబడుతున్న డొమెస్టిక్ సిలిండర్లు

## ఇప్పటికే సుమారు 100 సిలిండర్లు స్వాధీనం..

## ఏండ్లుగా అక్రమ వినియోగం

## అధికారుల అలసత్వానికి నిలువుటద్దం

**మహబూబ్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం వల్ల రాష్ట్రంలోనే కాదు జిల్లాల్లోనూ గ్యాస్ సిలిండర్ల కొరత ఎక్కువైంది. దీంతో బ్లాక్ మార్కెట్ కేటుగాళ్లు దోపిడీకి తెర లేపుతున్నారు. ముఖ్యంగా ఒకప్పుడు వెయ్యి రూపాయలకే దొరికే సిలిండర్.. బ్లాక్‌లో రూ.23వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. గృహ అవసరాలకు సంబంధించిన గ్యాస్ సిలిండర్లను వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో అక్రమంగా వినియోగిస్తున్న అక్రమార్కులపై అధికారులు కొరడా ఝు ళిపిస్తున్నారు. యుద్ధ వాతావరణం సందర్భంగా గ్యాస్ నిలువల కొడతా ఏర్పడడంతో అధికార యంత్రాంగం మేల్కొన్నది. డొమెస్టిక్ సిలిండర్ల కొరత ఏర్పడడంతో ఎట్టకేలకు అధికారులు తనిఖీలు ప్రారంభించారు. గత నాలుగు రోజులుగా –మిగతా4లో..

# రెండు దశల్లో జనగణన

## తొలిసారి డిజిటల్ విధానంలో గణన

## మూడు రోజుల శిక్షణ ముగింపు

## కార్యక్రమంలో కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 17 ప్రభాత వార్త :** అభివృద్ధి సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, ప్రణాళిక ల రూపకల్పన లో జనాభా గణన ఉపయోగ పడుతుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో చార్జి అధికారులకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత నిర్వహిస్తున్న తొలి జనగణన అని, 2011 జనాభా గణన తర్వాత 2021లో నిర్వహించవలసిన ఈ ప్రక్రియ కోవిడ్ కారణంగా ఆలస్యంగా జనాభా గణన 2027లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలలో జనాభా పరంగా, పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, తెలిపారు. జన గణన కార్యక్రమం రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. మొదటి దశలో ఇళ్ల జాబితా (హౌస్‌లిస్టింగ్, హౌస్ ఎన్యూమరేషన్), గృహాల గణన, తెలంగాణ రాష్ట్రంలో ఈ దశ మే 11, 2026న ప్రారంభమై జూన్ 9, 2026 వరకు కొనసాగుతుందని, రెండవ దశలో జన గణన (పాపులేషన్ ఎన్యూమరేషన్) ప్రక్రియ ఫిబ్రవరి 2027లో నిర్వహించబడుతుందని, మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారని అన్నారు. ఈ సంవత్సరం జరగనున్న జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నారని, మొబైల్ యాప్‌లు, వెబ్ పోర్టల్‌లను ఉపయోగించి గణన ప్రక్రియను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేందుకు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రత్యేక



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

హాజరైన అధికారులు

పోర్టల్‌ను గణన ప్రారంభానికి సుమారు 15రోజుల ముందు అంటే ఏప్రిల్ 26నుండి మే 10 వరకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. మొదటి దశలో నిర్వహించబడే ఇళ్ల జాబితా మరియు గృహాల గణనలో ఇంటి నిర్మాణం (కచ్చా పక్కా, తదితర,) ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం వంటి వివరాలతో పాటు రేడియో, టెలివిజన్, స్మార్ట్ ఫోన్ , కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని ఈ శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు. జనాభా లెక్కలు సేకరించడం ఒక ముఖ్యమైన బాధ్యతతో పాటు సవాలుతో కూడుకున్న పని అని ఆమె పేర్కొన్నారు. అందుకు అధికారులు శిక్షణ లో తెలియచేసే ప్రతి విషయాన్ని అవగాహన చేసుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని తప్పకుండా గణనలో చేర్చాలని అధికారులకు ఆమె ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుండి ఉపాధి కోసం వచ్చిన వలస కూలీలను కూడా గణనలో చేర్చి వారి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, పైస్థాయి అధికారులతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరించుకుని జనగణనను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ కార్యాలయం ఏడి అర్ధనారీశ్వర సామి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రెవెన్యూ గ్రామాలను, పట్టణాల్లోని వార్డులను సి.ఎం.ఎం.ఎస్ పోర్టల్ ద్వారా హౌస్ లిస్టింగ్, ఎన్యూమరేషన్ చేయడం, స్వయంగా చేయడం శిక్షణ లో వివరించారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో జన గణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు ఈ కార్యక్రమంలో జడ్.పి. సి.ఇ.ఓ, ఇంచార్జి డిపిఓ వెంకట రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా విద్యా శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, జిల్లా మాస్టర్ ట్రైనర్ బాలు యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# నూతన భవనంలోకి వైద్య కళాశాల

## కొత్త మెడికల్ కళాశాల భవనాన్ని సందర్శించిన కలెక్టర్

## వచ్చే పది రోజుల్లో కొత్త భవనంలోకి

## మెడికల్ కాలేజీ షిఫ్ట్ : జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి



మెడికల్ కళాశాల భవనాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

**వనపర్తి, మార్చి 17 ప్రభాతవార్త :** ప్రభుత్వ వైద్య కళాశాల నూతన భవనంలో వెంటనే విద్యార్థులకు తరగతులు ప్రారంభించేందుకు కావలసినచర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. మంగళవారం కాలేజీ కొత్త భవనాన్ని సందర్శించి పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులకు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే 10 రోజుల్లోనే మెడికల్ కాలేజీని కొత్త భవనంలోకి షిఫ్ట్ చేసి విద్యార్థులకు తరగతి గదులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ప్రస్తుతం కళాశాల కొనసాగుతున్న భవనం నుంచి అవసరమైన పరికరాలను త్వరితగతిన కొత్త భవనానికి తరలించాలని అలాగే ఆర్అండ్‌బి అధికారులకు భవనంలో ఎటువంటి లీకేజీలు లేకుండా చూసుకోవాలని, ప్రతి గదికి గది నంబర్లతో కళాశాల ఆవరణలో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, విద్యార్థుల సౌకర్యార్థం తరగతి గదులు మరియు ప్రయోగశాలల్లో అవసరమైన పరికరాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరలోనే ఈ భవనానికి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేటాయించిన స్థలాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పనులను నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులు ప్రణాళిక ప్రకారం కొనసాగించాలని ఇంజనీరింగ్ అధికారులు మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఆర్అండ్‌బి కార్యనిర్వాహక ఇంజనీర్ దేశ్య నాయక్, ఈ డబ్ల్యు ఐ డి సి కార్యనిర్వాహక ఇంజనీర్ రామచందర్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట వున్నారు.

# గద్వాలలో విషాద ఛాయలు

## బస్సు, ద్విచక్ర వాహనం ఢీ కొన్న ప్రమాదంలో

## ఇంటర్ విద్యార్థి మృతి, మరొకరి పరిస్థితి విషమం



ప్రమాదంలో మృతి చెందిన ఇంటర్ విద్యార్థి రాము

**గద్వాల మార్చి 17, ప్రభాత వార్త :** బస్సు, ద్విచక్ర వాహనం డి కొన్న ప్రమాదంలో ఒక్కసారిగా గద్వాల పట్టణంలో విషాద ఛాయలు నెల కొన్నాయి. ఈ ప్రమాదంలో అయిజకు చెందిన మైనర్ విద్యార్థి రాము అక్కడికక్కడే మృతి చెందగా, మిట్టదొడ్డి కి చెందిన మరో విద్యార్థి విష్ణు పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఈ దుర్ఘటన చుసిన వారు, విన్న వారు ఒక్కసారిగా పిల్లల విషయంలో ఉలిక్కి పడ్డారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో మంగళవారం ఆర్టీసీబస్సు, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఓ విద్యార్థి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ లోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు తమ స్వగ్రామం అయిజ నుండి పనుల నిమిత్తం రైలులో హైదరాబాద్ వెళ్ళడానికి గద్వాల రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. తాము వెళ్ళాల్సిన రైలు ఆలస్యం కావడంతో, ఆ సమయాన్ని గడపడానికి స్టేషన్ నుండి బయటకు వచ్చి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రైల్వే స్టేషన్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అయిజకు చెందిన రాము (17) అక్కడికక్కడే మృతి చెందాడు. బైకుపై ఉన్న – మిగతా4లో..

# జిల్లా అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషించాలి

**గద్వాల మార్చి 17, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లాలో మహిళల జనాభా, ఉద్యోగినిల సంఖ్య ఎక్కువే కాబట్టి జిల్లా అభివృద్ధిలో వారు కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గద్వాల ఐడిఓసి సమావేశపు మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మహిళలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలోని పలు సామాజిక సమస్యలను నిర్మూలించేందుకు తమ వంతుగా కృషి చేస్తారని ఇటీవల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన మహిళ సర్పంచులు, కౌన్సిలర్లను ఈ కార్యక్రమానికి



మెమంటో అందజేస్తున్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్, మున్సిపల్ చైర్ పర్సన్

ప్రత్యేకంగా ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. బాల్యవివాహాలను చేయడం వలన కలిగే దుష్పరిణామాలను గురించి వివరిస్తూ, వీటి నిర్మూలనకు సహకరించాలన్నారు. జిల్లాలో ఇటీవల ఫోక్సో కేసులు ఎక్కువగా నమోదు కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పిల్లలకు అవగాహన కలిగించాలని, వేధింపులకు గురైన మహిళలు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తేనే తప్పు చేసినవారికి శిక్షలు వేయడం జరుగుతుందన్నారు. వరకట్న వేధింపులు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు సఖీ కేంద్రంలో కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జనాభా గణన చేపట్టే నాటికి జిల్లాలో మహిళల అక్షరాస్యత శాతం పెరిగేందుకు కృషిచేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని పేర్కొన్నారు. ఇందిర మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను అందజేస్తుందని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అమ్మాయిల పట్ల వివక్ష చూపడం సరికాదని, వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అలాగే వివిధ రంగాలకు చెందిన మహిళలు ప్రసంగించారు. అంతకుముందు పలు విద్యాసంస్థల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళల సంక్షేమంపై రూపొందించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పి శంకర్, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, డిడబ్ల్యుఓ సునంద, డీఈవో విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రభావతి, డిసిపిఓ నరసింహా, పలువురు మహిళ సర్పంచులు, కౌన్సిలర్లు, మహిళా ఉద్యోగులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

# చేపల కోసం చెరువులో నీటిని తోడేస్తున్నారు

## చెరువు కింద రైతులు తీవ్ర ఆందోళన.. పట్టించుకోని ప్రభుత్వ అధికారులు

**దేవరకద్ర, మార్చి 17 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం గోపన్ పల్లి గ్రామం లోని చెరువులోని నీటిని చాపల కోసం చెరువు పైకి తోడేయడంతో చెరువు కింద రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎండలు బాగా ముదిరేయడంతో పంట చేతికి దిగుబడి వచ్చే సమయంలో చెరువులోని నీటిని చెరువు పైకి నీటిని తోడేయడంతో 15 రోజుల్లో పంట చేను చేతికొచ్చే సమయంలో గ్రామ రాజకీయ నాయకులు, తమ స్వలా భం కోసం రైతులను ఇబ్బందికి గురిచేస్తున్నారనీ కింది రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చేపలు పట్టడం కోసం కొంత మం ది చెరువులో ఉన్న నీటిని బయటికి వృధా గా మోటార్లు పెట్టి చెరువు పైకి కొడుతూన్నాడంతో చెరువు కింది రైతులకు భూగర్భ జలాలు తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులలో రైతులు వేసుకున్న వరి పంట పూర్తి చేతికి అందుతుంది. ఈ సమయంలో చెరువులో ఉన్న నీరును





చెరువులో నుంచి నీటిని తోడేస్తున్న దృశ్యం

బయటికి తీస్తే భూగర్భ జలం తగ్గి తమ బోర్లు సాగునీరు అందక వరి పంట ఎండిపోయే అవకాశం ఉన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాని ప్రభుత్వ అధికారులకు దృష్టికి తీసుకెళితే పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోని 15 రోజులు చెరువు నుంచి నీటిని తొలగించకుండా నిలుపుదల చేసి పంటలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.

# స్వయం ఉపాధి అవకాశాలు

## షెడ్యూల్డ్ కులాలకు సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ కుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు (ఎస్సీ) చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలను అందించడానికి ఆర్థిక సహాయం జిల్లా ఎస్. సి.కార్పొరేషన్ ద్వారా అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 2025,26 సంవత్సరానికి రూ.లక్ష, రూ.3లక్షల వరకు యూనిట్‌లకు 90శాతం సబ్సిడీతో బ్యాంకు సహాయంతో (70వరకు), రూ.3లక్షల నుండి రూ.7లక్షల వరకు (50% నుండి 60% వరకు) సబ్సిడీ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకంలో స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా లబ్ధిదారులకు ప్రోత్సాహం కల్పించబడును. వయస్సు 2150 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. అభ్యర్థులు – మిగతా4లో..



జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

## కాటవరం పాఠశాలను సందర్శించిన ఏఎంఓ

**అడ్డాకుల, మార్చి 17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కాటవరం ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఏఎంఓ దూకుడు శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల విద్యార్థుల సంఖ్యను పెంచుకునే విధంగా చర్యలు చేపట్టాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో సమన్వయం చేసుకొని పాఠశాలలో ఏఐ (ఏ ఎక్స్ ఎల్) వేగవంతమైన అభ్యాసం/ త్వరితగతిన నేర్చుకునేందుకు తరగతులను ప్రారంభించాల్సిందిగా ఉపాధ్యాయులకు ఆయన ఆదేశించారు. ( ఎఫ్ఎల్ఎస్) ప్రాథమిక అక్షరాస్యత సర్వే కోసం మూడో తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. తదనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేసి, బోర్డ్ పై రాసిన ఆంగ్లము పదాలను విద్యార్థులచే చదివించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాగిణి దేవి, ఉపాధ్యాయురాలు కృష్ణవేణి, స్ట్రాంగ్ టీచర్ దండు రాఘవ, సిఆర్పి చిన్నయ్య పాల్గొన్నారు.



పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఏఎంఓ

## రైతులు రైతు భరోసా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

**నవాబుపేట, మార్చి 17 ప్రభాతవార్త :** రైతు భరోసా దరఖాస్తును రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏవో కృష్ణ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. నవాబుపేట మండల పరిధిలోని గ్రామాల రైతులకు కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు ఈనెల 25వ తేదీ వరకు రైతు భరోసా కొరకై సంబంధిత ఏఈఓ సంప్రదించి రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని మండలంలోని రైతులకు వ్యవసాయ అధికారి కీలక సమాచారాన్ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి 2026 సంవత్సరానికి గాను రైతుభరోసా పథకం కింద కొత్తగా ఫిబ్రవరి 28/02/2026 వరకు భూమి రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, కొత్తగా పట్టా పాస్బుక్ పొందిన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు కోసం పట్టా పాస్బుక్ (లేదా తహసిల్దార్ డిజిటల్ సంతకం చేసిన కాపీ), ఆధార్ కార్డు, సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించాలని అన్నారు. రైతులు దరఖాస్తు ఫారం నింపి అవసరమైన పత్రాల జిరాక్స్ కాపీలతో కలిపి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులకు మార్చి 25వ తేదీలోపు అందజేయాలని మండల వ్యవసాయ అధికారి సూచించారు. అదేవిధంగా, అవసరమైతే బ్యాంక్ అకౌంట్ వివరాలను మార్చుకునే అవకాశం కల్పించబడిందని పేర్కొన్నారు. గడువులోపు దరఖాస్తు చేసుకుని పథకం ప్రయోజనాలు పొందాలని ఆమె రైతులను కోరారు.

## ప్రభుత్వ పథకాలను పూర్తిచేసే బాధ్యతలు స్వీకరించాలి

**ఉప్పునుంతల, మార్చి 17 ప్రభాతవార్త :** గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ పథకాలను విజయవంతంగా సాగించేందుకు పంచాయతీ కార్యదర్శులు సహకరించాలని ఇంఛార్జి ఎంపిడిఓ తుమ్మల రేవత్ రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో పంచాయతీ కార్యదర్శి, ఈజీఎస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణం పూర్తి అయ్యేలా విషయాలు కోరారు. అదేవిధంగా మండలంలో ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసి త్వరగా గృహ ప్రవేశాలు నిర్వహించాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలంలో గ్రామపంచాయతీ వారిగా ఏర్పాటు చేసిన నర్సరీ పెంపకం పట్ల వారికి అవగాహన కల్పించారు. మండలానికి మంజూరైన కమ్యూనిటీ సోక్ పెట్స్ ప్రారంభించాలని సూచించారు . ఈ సమావేశంలో ఇంఛార్జి ఎంపిడిఓ తుమ్మల రేవత్ రెడ్డి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఈజీఎస్ ఏపీఓ పర్వతాలు, ఈసి కుర్మా రెడీ, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉప్పునుంతల ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఇంఛార్జి ఎంపిడిఓ రేవత్ రెడ్డి

## ప్రధానమంత్రి గ్రామీణ క్రీడల పోస్టర్ విడుదల

**మద్దూరు, మార్చి 17 ప్రభాతవార్త :** యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమం మార్చి 9 నుండి 24 వరకు పాలమూరు పార్లమెంట్ పరిధిలో ఘనంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా మద్దూరు పట్టణ కేంద్రంలో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని బీజేపీ కొడంగల్ తాలూకా ఇన్‌చార్జి ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ క్రీడా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మద్దూరు పట్టణంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, సిపిరి వెంకటయ్య, రాజు గౌడ్, సాయిలు, వెంకటయ్య, భరత్, రఘు చారి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారుల కోసం క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్ నమోదు సౌకర్యాన్ని అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు.

## గ్రామ కంఠం భూమిపై ఏడి సర్వే చేయాలి

**కిషన్ గూడ గ్రామ సర్పంచ్ లౌడియా లచ్చి**

**నవాబుపేట, మార్చి 17 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కిషన్ గూడ గ్రామంలో ఉన్న గ్రామ కంఠం భూమిపై వెంటనే ఏడి సర్వే నిర్వహించాలని కిషన్ గూడ గ్రామ సర్పంచ్ లావుడియా లచ్చి, ఉప సర్పంచ్ రాజు యాదవ్ గ్రామస్తులు అధికారులను కోరారు. గ్రామ కంఠం భూమిపై జరుగుతున్న ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గ్రామ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లావుడియా లచ్చి మాట్లాడుతూ గ్రామ కంఠం భూమి అనేది గ్రామ ప్రజలందరికీ చెందిన సామూహిక ఆస్తి అని, దానిని రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఆ భూమిపై అధికారికంగా ఏడి సర్వే నిర్వహించి అసలు సరిహద్దులను నిర్ణయించి అక్రమ ఆక్రమణలు ఉన్నట్లయితే వెంటనే తొలగించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో ప్రేమ్ కుమార్ నాయక్, గ్రామవార్డ్ సభ్యులు, మాజి సర్పంచ్, చెన్నయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాదాసి కురువలకు మాట ఇచ్చి అమలు చేయని మంత్రి

**ఆగ్రహంలో సంఘం, అసెంబ్లీలో 1268 జీవోపై చర్చ కోరుతూ హెచ్చరిక**

**ధన్వాడ, మార్చి 17 ప్రభాతవార్త :** మాదాసి మదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ మదాసి కురువ సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మక్తల్ బహిరంగ సభలో మంత్రి వాకిటి శ్రీహరి ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయకపోవడం పట్ల సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల ప్రచార కార్యదర్శి కురువ నవీన్ మాట్లాడుతూ, గత 75 సంవత్సరాలుగా రాజ్యాంగ హక్కులు అందక మదాసి కురువలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఎన్నికల సమయంలో 1268 జీవో అమలు చేసి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని మంత్రి హామీ ఇచ్చినా, రెండు సంవత్సరాలు గడిచినా ఒక్కసారి కూడా అసెంబ్లీలో మా సమస్యను ప్రస్తావించలేదు" అని అన్నారు. జిల్లా నాయకులు పలుమార్లు మంత్రిని కలిసి వినతి పత్రాలు అందజేసినా, సమస్యను వాయిదా వేస్తూ వస్తున్నారని ఆరోపించారు. కనీసం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో అయినా 1268 జీవో అమలుపై చర్చించి, మదాసి కురువలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా సమాధానం ఇస్తామని సంఘం నాయకులు హెచ్చరించారు.

## ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలు ఇవ్వాలి

**అమరచింత మార్చి 17, ప్రభాతవార్త :** ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అమరచింత ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు, అజయ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అమరచింత మండల అధ్యక్షులు శంకర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ కూలీలు గత మూడు నెలలుగా పనులు చేసిన అధికారులు కూలీల డబ్బులు ఇవ్వడం లేదని ఉపాదామి కూలీలకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు పెండింగ్లో ఉన్న బకాయిలు ఇవ్వాలని వారు అధికారులను కోరారు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు 800 ఇవ్వాలని ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 భరించాలన్న నిబంధనను కేంద్రం ఎత్తివేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీల పని ప్రదేశంలో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు పనిముట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని వారు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో దేవర్ల మోహన్, ఆర్ఎన్ నాగరాజు, బెక్కం కురుమన్న, విజయ్, అశోక్, నర్సమ్మ కురుమక్క అలివేల తదితరులు పాల్గొన్నారు.




ఎంపీడీవో కార్యాలయం ముందు కూలీలు ధర్నా

# ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలి

**గద్వాల మార్చి 17, ప్రభాతవార్త :** ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి బూత్ లెవల్ ఏజెంట్స్‌ను నియమించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పురోగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పారదర్శకమైన ఓటర్లజాబితా కోసం నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయపార్టీల పాత్ర చాలాముఖ్యమని తెలిపారు. ఈ ప్రక్రియ ఓటర్ల పేర్లు తొలగించేందుకు కాదని, ఒకే వ్యక్తికి సంబంధించిన డూప్లికేట్ ఓటర్ నమోదులను తొలగించడం, వలసల వల్ల వచ్చిన లోపాలను సరిచేయడం ద్వారా స్పష్టమైన, పారదర్శకమైన కొత్త ఓటరుజాబితాను తయారు చేయడమే ప్రధాన ఉద్దేశమన్నారు. 2002 మరియు 2025 ఓటరు జాబితాలను పోల్చి ఓటర్లను ఏ ,బి ,సి ,డి వర్గాలుగా విభజించి క్షేత్ర స్థాయిలో ధృవీకరణ జరుగుతున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ బూత్‌కు తప్పనిసరిగా బూత్ లెవల్ ఏజెంట్స్ లను నియమించాలని సూచించారు. నియమితులైన బూత్ లెవల్ ఏజెంట్లకు అధికారిక ఐడీ కార్డులు అందజేయబడతాయని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు తప్పనిసరిగా ఆగ్రామానికి చెందిన వారే ఉండాలని, తద్వారా క్షేత్ర స్థాయిలో ఓటర్ల వివరాల ధృవీకరణ, అవసరమైన పత్రాల సేకరణలో కీలకంగా పనిచేస్తారని తెలిపారు. బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాను 1-2 రోజుల్లోగా సమర్పించాలని, వారికి మార్చి 25 లోపు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా గద్వాల్ పట్టణంలో పురోగతి సుమారు 48 శాతం మాత్రమే ఉన్నందున పనులను వేగవంతం చేయాలని సూచించారు. వలసల కారణంగా ఓటర్ల వివరాల్లో ఉన్న సమస్యలతో పాటు కొత్తగా నమోదు అయిన ఓటర్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు, అధికారులు, సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏ.ఓ భూపాల్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరిటెండెంట్ మంజుల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ జాబితా పై మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జిల్లాలోని ఈవీఎం గోడౌన్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల నెలవారి తనిఖీలో భాగంగా మంగళవారం కలెక్టర్ రిజవాన్ బాషా షేక్ ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచి తనిఖీ చేశారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.



ఈ వి ఎం గోడౌన్ పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**క్రీడల్లో జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలి...**

మన జిల్లా క్రీడాకారులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో సైతం రాణించి, జోగులాంబ గద్వాల జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఇటీవల జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో జూడోలో 66 కేజీల విభాగంలో జిల్లా క్రీడాకారుడు బంగారు పతకం, 46 కేజీల విభాగంలో జిల్లా క్రీడాకారిని రజత పతకం సాధించడమే కాక జిల్లా మహిళల కబడ్డీ జట్టు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో, పురుషుల జట్టు తృతీయ స్థానంలో నిలవడంతో మంగళవారం కలెక్టరేట్లో క్రీడాకారులు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. అనంతరం జిల్లా క్రీడా శాఖ తరపున కలెక్టర్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ క్రిష్ణయ్య, ఎస్జిఎఫ్ సెక్రెటరీ శ్రీనివాసులు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల స్ఫూర్తితో పోరాడుదాం..

**పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు కె.హర్షవర్ధన్**

**దేవరకద్ర, మార్చి 17 ప్రభాతవార్త:** దేవరకద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ ,రాజ్‌గురు , సుఖ దేవ్ ల 95వ వర్ధంతి సభల పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్ మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్వేషపూరిత రాజకీయాలు దేశ ప్రజల ఐక్యతకు ప్రమాదకరంగా మారాయి. లౌకిక వ్యవస్థను విచ్చినం చేసే కుట్రలకు పాల్పడుతున్నారు. మేక్ ఇన్ ఇండియా మేడిన్ ఇండియా అంటూ విదేశీ వస్తువులను దిగుమతి చేసుకుంటున్నది. అమెరికా విధించే ఆంక్షలకు గంగిరెద్దుల తల ఊపుతూ దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నది అని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి దేశంలో ఉన్నత చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా నిరుద్యోగ భారతాన్ని నిర్మించారు. పాలకుల విధానాలతో నేడు విద్యారంగం పూర్తిగా వ్యాపారమయ్యింది ప్రతి ఏటా 70 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరం కావల్సిన పరిస్థితి నెలకొన్నది. మతం పేరుతో యువతకు మత్తుమందు ఇచ్చి నిద్రపుచ్చుతున్నది అని అన్నారు. భారతదేశం బ్రిటిష్ పాలన విముక్తి పొందిన అనంతరం ప్రజలు దోపిడికి గురికాకుండా సమానత్వ సమాజం ఏర్పాటు చేసుకోవాలని వీరమరణం పొందిన భగత్ సింగ్, రాజ్ గురు, సుకుదేవుల, పోరాట స్ఫూర్తితో సమసమాజ స్థాపనకై విద్యార్థులు, యువత క్రియాశీలక ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌశిక్, అనిల్, శివ ,సంతోష , అనూష, అక్షయ, అపర్ణ , సుష్మిత, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పిడిఎస్‌యు నాయకులు

# గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన

**అడ్డాకుల, మార్చి 17 ప్రభాతవార్త :** గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై, కలిగే అనర్థాలపై విద్యార్థులకు మండల కేంద్రంలో పియం శ్రీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీస్ శాఖ అడ్డాకుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ప్రభావాలను వివరించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని, కుటుంబాలు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యంపై కలిగే హానికర ప్రభావాలను వివరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాల నుండి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ప్రజలకు మత్తు పదార్థాల నియంత్రణ చట్టాల గురించి కూడా అవగాహన కల్పించారు. అనుమానాస్పద కార్యకలాపాలను గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. తధానంతరం మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు అందరూ కలిసి పనిచేయాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు జ్యోతి, సీనియర్ ఉపాధ్యాయులు రఘునాథ్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.




మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాస్

# పోలీస్ దాడిలో గాయపడిన బీజేపీ నాయకుడికి పరామర్శ

**రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్**

**వనపర్తిరూరల్, మార్చి 17 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంలో జరిగిన ఘటనలో పోలీస్ దాడికి గురై గాయపడిన బీజేపీ నాయకుడు, మున్సిపల్ ఎన్నికల్లో 31వ వార్డు కౌన్సిలర్ దాసరాజు ప్రవీణ్ బీజేపీ రాష్ట్రకార్యదర్శి శ్రీ పోతుగంటి భరత్ ప్రసాద్, పార్టీ రాష్ట్ర , జిల్లా నాయకులతో కలిసి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సోమవారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా పోతుగంటి భరత్ ప్రసాద్, అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వనపర్తి పట్టణంలో జరిగిన ప్రమాద ఘటనపై స్పందించిన దాసరాజు ప్రవీణ్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి విచక్షణారహితంగా కొట్టడం తీవ్రంగా ఖండనీయమని అన్నారు. తెలంగాణ పోలీసులు ప్రకటిస్తున్న ఫ్రెండ్లీ పోలీసింగ్" విధానానికి ఇటువంటి చర్యలు పూర్తిగా విరుద్ధమని వారు పేర్కొన్నారు. ఏదైనా అభ్యంతరం లేదా పొరపాటు జరిగి ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం సముచితంగా ఉంటుంది కానీ, స్టేషన్‌కు పిలిపించి దాడి చేయడం చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నట్టేనని తెలిపారు. పోలీస్ దాడి కారణంగా గాయపడిన దాసరాజు ప్రవీణ్ గత మూడు రోజులుగా ప్రభుత్వ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్నారని, ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని దాసరాజు ప్రవీణ్ కి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ పరామర్శించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భాషెట్టి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి, 26వ వార్డు కౌన్సిలర్ ఎం. విజయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ కంచరవి, కేతూరి బుడ్డన్న, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి రాయన్న తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన బిజెపి నాయకుడిని పరామర్శిస్తున్న నాయకులు

# ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమం

**గద్వాల మార్చి17, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో అమలవుతున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, గద్వాల్‌లోని ఎం.ఏ.ఎల్.డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కసారి వినియోగించే ప్లాస్టిక్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి డా. జి. విద్యుల్లత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలపై అవగాహన కల్పించడం, పర్యావరణానికి అనుకూలమైన ప్రత్యామ్నాయాల వినియోగాన్ని ప్రోత్సహించడం. ఈ కో క్లబ్ కన్వీనర్ డా. ఎస్. కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఒక్కసారివినియోగించే ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ ప్రమాదాలను వివరించారు. క్యారీబ్యాగులు, డిస్పోజబుల్ కప్పులు, స్ట్రాలు, ప్యాకేజింగ్ సామగ్రి వంటి ప్లాస్టిక్ వస్తువులు సౌకర్యం కోసం విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయని, అయితే అవి ఒక్కసారి వాడిన తర్వాత పారబోసి వేయబడటం వల్ల తీవ్రమైన కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు పూర్తిగా కరుగుటకు ఎన్నో సంవత్సరాలు పట్టడం వల్ల జీవవ్యవస్థ, వన్యప్రాణులు మరియు జలవనరులకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షేక్ ఖలందర్ బాషా మాట్లాడుతూ, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. పర్యావరణానికి మేలు చేసే అలవాట్లు అలవరచుకోవాలని, పరిశుభ్రమైన, స్థిరమైన వాతావరణం కోసం చేపట్టే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన కాలుష్య నియంత్రణమండలి, ఉపాధ్యాయ లకృషిని అభినందించారు. ఈకార్యక్రమంలో కార్యక్రమానికి కళాశాల ఉపాధ్యాయులు, ఈకో క్లబ్ సభ్యులు డా. ఎన్. హరినాథ్, శ్రీ జె. వెంకటేశం, డా. జి. గణేష్, శ్రీ సుబ్రమణ్యం, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

## ముందస్తు అరెస్ట్



పంచాయతి కార్మికులను అరెస్టు చేసిన పోలీసులు

**ఉప్పునుంతల, మార్చి 17 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో నేడు మంగళవారం తలపెట్టిన మహా ధర్నాకు వెళ్లకుండా గ్రామపంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అరెస్టు అయిన పలువురు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని తమ డిమాండ్ల ను పరిష్కరించేంతవరకు ఉద్యమం ఆపే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఆలూరి రమేష్, భీమయ్య, రాజలింగం, ముత్యాలమ్మ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

## తండాల్లో అండర్ డ్రైనేజీల నిర్మాణం

**నవాబుపేట, మార్చి 16 ప్రభాతవార్త :** మండలపరిధిలోని కాకర జాల తాండలో మోలిక వసతుల కల్పనకు ప్రజా పాలనలో భాగంగా అండర్ డ్రైనేజీ పనులను సర్పంచ్ సంతోష్ నాయక్ మొదలుపెట్టారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు, అండర్ డ్రైనేజీల నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో ప్రాధాన్యత నిస్తూ గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు నిస్తుందని గిరిజన తండాలలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చొరవతో తండాలకు ప్రాధాన్యమిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని సర్పంచ్ సంతోష్ నాయక్ గ్రామస్తులు అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో, ప్రజల విజ్ఞప్తుల మేరకు అవసరమైన చోట పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెల్కిచర్లలో సర్పంచి ఇఫ్తార్ విందు

**భూత్పూర్, మార్చి17, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామంలో గ్రామ సర్పంచి రమేష్ గ్రామ ముస్లింలకు ఇఫ్తార్ విందునేర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి రమేష్ మాట్లాడుతూ పండుగలు మత సామరస్యానికి ప్రతీకలన్నారు. హిందూ ముస్లింలు సోదరభావంతో పండుగలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పల్లె రాంరెడ్డి, ఉప సర్పంచి గోసుల రమేష్‌తో పాటు ముస్లిం నాయకులు గౌస్, మౌలానా, కలీం ఇతర కాంగ్రెస్ నాయకులు సభావత్ దశరథ్ నాయక్, సభావత్ జైపాల్ నాయక్ పాల్గొన్నారు.

## పోతులమడుగులో పశువైద్యశిబిరం

**భూత్పూర్, మార్చి 17, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం పోతులమడుగులో మంగళవారం భూత్పూర్ మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి ఆనంద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 30మంది రైతులు తమకు చెందిన 357గేదెలకు గాలికుంటు నివారణ మందులు వేయించారు. పశువులకు పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్‌గౌడ్ పరీక్షలు నిర్వహించి తగిన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సర్పంచి కోట్ల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు

**దామరగిద్ద, మార్చి 17 ప్రభాతవార్త:** జాతీయ ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బాపనపల్లి రైతు వేదికలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, రసాయన రహిత సాగు పద్ధతులు, ఖర్చు తగ్గింపు విధానాలు, పంట దిగుబడుల పెంపు గురించి వివరించారు. అలాగే జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం వంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల తయారీ, వినియోగాన్ని ప్రాయోగికంగా చూపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతులు ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయడంతో పాటు భూమి సారాన్ని కాపాడేందుకు ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి

■ కళాశాలలు, నిర్మాణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి ■ నార్కోటిక్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీతరెడ్డి

**వనపర్తి, మార్చి 17 ప్రభాతవార్త:** జిల్లాలోని విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డితో కలిసి ఎన్‌కార్డ్ నార్కోటిక్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూల నకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కళాశాలలు నిర్మాణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలల స్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి నెల చివరి రోజున నిర్వహించే సివిల్ రైట్స్ డే సందర్భంగా ప్రతి మండలంలో ఒక గ్రామంలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో విద్యాశాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖలు పోలీసు శాఖతో సమన్వయంతో పాల్గొనాలని సూచించారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ నార్కోటిక్స్ కమిటీలను యాక్టివేట్ చేయాలని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులను జిల్లా వ్యాప్తంగా కల్లు దుకాణాలలో మైనర్లకు కల్లు విక్రయం జరగకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన విషయంపై విచారించారు. దీనికి సంబంధించి అన్ని దుకాణాలను తనిఖీ చేసి, మైనర్లకు విక్రయం జరగకుండా చర్యలు తీసుకున్నామని, ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేయించామని అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమాజాన్ని కాపాడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా జూన్ 1న ప్రతి మండలంలో నాలుగు గ్రామాలలో డ్రగ్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ రోజున మొత్తం 15 మంది డీఎస్పీలు జిల్లాకు వచ్చి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారని, గ్రామాల వివరాలను ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్య నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, డీఈవో అబ్దుల్ ఘని, సంక్షేమ అధికారిని సుధారాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

## పంటలపై రైతులకు శిక్షణ కార్యక్రమం


సమావేశంలో అధికారులను సందేహాలు అడుగుతున్న రైతు

**గద్వాల మార్చి17,ప్రభాతవార్త:** కొండపల్లి గ్రామములో రైతు శాస్త్రవేత్త చర్చ, శిక్షణ కార్యక్రమాన్ని ఆత్మ సౌజన్యంతో నిర్వహించారు. ఈ కార్యక్రమములో డాక్టర్ అర్చన తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం,మహబూబ్‌నగర్ వారురైతులకు వివిధ రకాల పంటలపై అవగాహన కల్పించారు. గద్వాల మండలం కొండపల్లి గ్రామ రైతులతో వివిధ పంటల మేలైన రకాలు, పత్తి, మిరప, కంది, మొక్కజొన్నపై వచ్చే తెగుళ్లు, చీడ పీడల గురించి, వాటి నివారణ గురించి చర్చించినట్లు మండల వ్యవసాయ అధికారి ఏ.ఓ. ప్రతాప్ కుమార్ తెలిపారు. పంటల పై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి పరచారన్నారు. ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ జగ్గు నాయక్ ప్రకృతి వ్యవసాయం గురించి, పంటలపై ఇష్టానుసారంగా పురుగుమందులను రైతులు కొడుతున్నారని, దీని వలన వివిధ రకాల క్యాన్సర్ వంటి రోగాలు వస్తాయని, రైతులు పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు, వేప నూనె పంటలకు విరివిగా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఏడిఏ సంగాలక్ష్మి, గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, మండల ఏఈఓఅనూష, రైతులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం


సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్

**గండీడ్ మార్చి 17, ప్రభాతవార్త:** మండల పరిధిలో చేన్నయిపల్లి తాండలో మంగళవారం గ్రామ సర్పంచ్ దశరథ్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి మూడు లక్షల పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా సహకరించాలని అన్నారు. ఒక్కొక్కటిగా పనులు ప్రారంభిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతానని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని ప్రజలకు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంగమ్మ ఉపసర్పంచ్ భర్త దోమ శ్రీనివాస్ రెడ్డి. టి ఏ శ్రీనివాసులు. వర్క్ ఇన్స్పెక్టర్ బాలకృష్ణ. వార్డ్ మెంబర్స్ పీకే నాయక్. లాలీ బాయ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులు, చట్టాలపై అవగాహన

**దామరగిద్ద, మార్చి 17 ప్రభాతవార్త:** మ్రహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, నారాయణపేట ఆధ్వర్యంలో దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ బాలల హక్కుల ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా బాల్య వివాహ నిషేధ చట్టం 2006, బాల కార్మిక చట్టం, విద్యా హక్కు చట్టం, అలాగే పిల్లలను లైంగిక నేరాల నుండి రక్షించే చట్టాల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై కూడా విద్యార్థులకు సూచనలు చేశారు. చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ అనాథ పిల్లల సమస్యలు,వారి సంరక్షణపై వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 గురించి తెలియజేస్తూ, ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతుందనే సమాచారం తెలిసిన వెంటనే ఈ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పియులో క్విజ్ పోటీలు


క్విజ్ పోటీలకు హాజరైన విద్యార్థులు

**మహబూబ్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా, పాలమూరు విశ్వవిద్యాలయంలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ తొమ్మిదో యూనిట్, ఎంబీఏ విద్యార్థుల కోసం క్విజ్ పోటీని నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. ఎస్.ఎన్. అర్జున్ కుమార్ మాట్లాడుతూ భద్రత, సమాచారం సమానమైన ఆదరణ వంటి ప్రాథమిక హక్కులను తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా వినియోగదారులకు సాధికారత కల్పిస్తుందని అన్నారు. ఈ సంవత్సరం ఖిసురక్షితమైన ఉత్పత్తులు, ఆత్మవిశ్వాసం గల వినియోగదారులు అనే అంశంపై దృష్టి సారించారు. అనంతరం తరగతిని జట్లుగా విభజించి మూడు రౌండ్ల క్విజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ డా. జావీద్ మహమ్మద్ ఖాన్, సిబ్బంది సభ్యులు డా. కె. నాగసుధ, డా.ఎం. అరుంధతిరెడ్డి పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డా.డి. మధుసూదన్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డా. కె. ప్రవీణ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వాలంటీర్లను అభినందించారు.

## కలెక్టర్‌ను కలిసిన ముడా చైర్మన్



**మహబూబ్‌నగర్ మార్చి 17 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ జిల్లా నూతన కలెక్టర్ ఖుష్బూ గుప్తాను ముడా చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిసారు. మంగళవారం వారి చాంబర్లో కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పుట్టింటి ప్రేమను గుర్తుచేసిన సీమంతం


గర్భిణీలకు సీమంతం చేస్తున్న దృశ్యం

**మద్దూరు, మార్చి 17 ప్రభాత వార్త :** స్త్రీ జీవితంలో తల్లి కావడం ఒక అపూర్వమైన అనుభూతి. ఈ నేపథ్యంలో మోమినాపూర్ గ్రామంలో గర్భిణీల కోసం ప్రత్యేకంగా సీమంతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గూళ్ల శ్రీదేవి రవికుమార్ స్వంత ఖర్చుతో గర్భిణీలకు సాంప్రదాయబద్ధంగా సీమంతం నిర్వహించి, పుట్టింటి ప్రేమను గుర్తు చేస్తూ ఆదరించారు. ప్రతి గర్భిణికి ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించడం ద్వారా వారి ముఖాల్లో ఆనందం నింపారు. అదేవిధంగా అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లకు చీరలు, పంచాయతీ సిబ్బందికి కొత్త బట్టలు అందజేసి గౌరవించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలరాజ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మీనాక్షి, అంగన్‌వాడీ టీచర్లు గాయత్రి, కవిత, ఆశా వర్కర్లు ఆనందమ్మ, మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

◆ పియూ ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్


క్రీడాకారులతో పియు ప్రొఫెసర్లు

**మహబూబ్‌నగర్, మార్చి 17 ప్రభాతవార్త:** క్రీడాకారులు పాలమూరు యూనివర్సిటీలో ఉన్నటువంటి క్రీడా సదుపాయాలను ఉపయోగించుకొని క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో మంచి ప్రదర్శన కనబరిచి మీయొక్క తల్లిదండ్రులకు, గ్రామానికి చదువుతున్న పాలమూరు విశ్వవిద్యాలయానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు తీసుకురావాలని పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకుల పతి జిఎన్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి ఇంటర్ యూనివర్సిటీలో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ తరపున పాల్గొనే ఖోఖో పురుషుల విభాగంలో ఎంపికలకు పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్ రిజిస్ట్రార్ ప్రొ॥ పి. రమేష్‌బాబు హాజరై క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రొ॥ జి ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలకు అవసరమైన సదుపాయాలను యూనివర్సిటీ కల్పిస్తుందని కాబట్టి క్రీడాకారులు క్రీడల్లో పాల్గొని మంచి ఫలితాలను తీసుకురావాలని సూచించారు. పాలమూరు విశ్వవిద్యాలయంనుండి గతసంవత్సరము రాష్ట్రస్థాయిలో ఆర్చరీ లో బంగారు పతకము వచ్చిందన్నారు. అలాగే విద్యార్థులు కష్టపడి ఇష్టమైన క్రీడలలో రాణించి పాలమూరు విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రొ॥ పి రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో మంచిగా రాణిస్తుండడం శుభ పరిణామం అని అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయానికి రాష్ట్రస్థాయిలో మంచి పతకాలు వచ్చాయని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుండి 31 వరకు దేవేంగిరి యూనివర్సిటీ కర్ణాటకలో నిర్వహించే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొంటుంది అని పాలమూరు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖోఖో ఇంచార్జి డా. రజిని, ప్రొ॥సత్య భాస్కర్ రెడ్డి, ఖోఖో అసోసియేషన్ సెక్రెటరీ ఆర్. బాలరాజయ్య, కోచ్లు, బి.రూప, తిరుమలేశ్,డా అరుణ్,యుగేందర్,పిఆర్ఓ డా. గాలెన్న తో పాటు క్రీడాకారులు పాల్గొనారు. ఈ ఎంపికల లో 8, టీమ్‌లు పాల్గొన్నాయి ఇందులో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేస్తారని తెలిపారు.

# కేజీబీవీ పాఠశాలల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

◆ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**గద్వాల మార్చి 17 , ప్రభాతవార్త:** కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల్లో ఎలాంటి రాజీ లేకుండా కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారుమంగళవారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని కెజిబివి పాఠశాలలలో మౌలిక సదుపాయాలు, ఖర్చులు తదితర అంశాలపై కెజిబివి పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేజీబీవీ పాఠశాలల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమతి లేకుండా ఎవ్వరినీ పాఠశాల ప్రాంగణంలోకి అనుమతించరాదని తెలిపారు. విద్యార్థినుల సంక్షేమం, భద్రత, సౌకర్యాల పరిరక్షణలో ప్రిన్సిపాళ్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, సురక్షితతాగునీరు, నాణ్యమైన ఆహారం, విద్యార్థినుల నిద్రకు తగిన వసతులువంటి కనీస మౌలిక సదుపాయాలపై ఎలాంటి రాజీ పడరాదని తెలిపారు. పాఠశాలలకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపుకలెక్టర్ నర్సింగరావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, కేజీబీవీ ఫైనాన్స్ అధికారి మధుసుధన్, కోఆర్డినేటర్ హంపయ్య, సంబంధిత అధికారులు, కేజీబీవీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్టాపన


యజ్ఞంలో పాల్గొన్న దంపతులు.. పోతురాజు స్వామి, బొడ్రాయి, శివలింగం, నంది విగ్రహాలకు నవధాన్యాలతో ధాన్యాధివాసం

**దామరగిద్ద, మార్చి 17 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం అన్నాసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ పోతురాజు స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం గ్రామంలో చండీ యాగం ఘనంగా నిర్వహించారు. అదే రోజు రాత్రి 11 గంటలనుండి తెల్లవారుజామున 3 గంటలవరకు గ్రామ నిర్బంధం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆ సమయంలో గ్రామంలోరాకపోకలు పూర్తిగా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇక సోమవారం రాత్రి జలాధివాసం కార్యక్రమాన్ని నిర్వహించగా, మంగళవారం ఉదయం పోతురాజు స్వామి, బొడ్రాయి, శివలింగం, నంది విగ్రహాలకు నవధాన్యాలతో ధాన్యాధివాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ దంపతులుయుగముగా పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. నేడు బుధవారం ఉదయం 7 గంటలకు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ప్రారంభమై, ఉదయం 11 గంటలకు ముగియనుంది. ఉమ్మడి జిల్లాలోనే అరుదైన ఈపోతురాజు స్వామి దేవాలయవిగ్రహప్రతిష్టాపన మహోత్సవాలనుభక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## ఎన్మన్‌గండ్లలో సంసద్ ఖేల్ మహోత్సవ్


సంసద్ ఖేల్ మహోత్సవ్ వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

**నవాబుపేట, మార్చి 17 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా నవాబుపేట మండల పరిధిలోని ఎన్మనగండ్ల హైస్కూల్ మైదానంలో నిర్వహించే సంసద్ ఖేల్‌కు అన్ని గ్రామాల నుండి యువతి యువకులకు మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించబడుతాయని మండల బిజెపి నాయకులు అన్నారు. మార్చి 9నుండి 24 వరకు క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆసక్తిగల గ్రామీణ క్రీడాకారులు మంచి అవకాశం కల్పిస్తున్న సందర్భంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షులు వాల్ పోస్టల్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువమోర్చా అధ్యక్షులు పల్లె తిరుపతి, జిల్లా కౌన్సిల్ మెంబర్‌లు ప్రెస్ శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మధుసూదన్ రెడ్డి, యువ నాయకులు అర్జున్ రెడ్డి, ఎన్మన్‌గండ్ల సర్పంచ్ రంజిత్ గౌడ్, నవీన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గణేష్ చారి, మాజీ బీజేవైఎం అధ్యక్షులు ఆంజనేయులు, బూత్ అధ్యక్షులు సంద రమేష్, ఎన్మనగండ్ల మాజీ సర్పంచ్ హనుమంతు వార్డు సభ్యులు సుధాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐ కిషన్‌నాయక్‌కు పలువురి నివాళులు

**భూత్పూర్, మార్చి 17,ప్రభాతవార్త :** గత కొంత కాలంగా అనారోగ్యం కారణంగా సోమవారం భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని రెండోవార్డు సోమ్లతండాలో మృతిచెందిన సీఐ కిషన్‌నాయక్ పార్థివ దేహం వద్ద పలువురు ప్రముఖులు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. పాలమూరు ఉమ్మడి జిల్లాల్లో పలు ప్రాంతాలల్లోని పీఎస్‌లలో ఎస్సై, సీఐ పదవులు నిర్వర్తించి పలువురు ప్రశంసలు పొందిన కిషన్‌నాయక్ సేవలు మరువలేనివని కార్యక్రమానికి హాజరైన మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నివాళులర్పించినవారిలో భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటి, భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, భూత్పూర్ పీఎస్ ఎస్సై చంద్రశేఖర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు కెంద్యాల నరేందర్, నిమ్మల సాయిరాం తదితరులు ఉన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**భూత్పూర్, మార్చి 17,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా చాలా చక్కగా అభినయించారు. హెచ్‌ఎంగాతక్షిత్, డీఈఓగా ఐశ్వర్య, ఎంఈఓగా భానుశ్రీ, కాంప్లెక్స్ హెచ్‌ఎంగా రేవంత్ ఆయా పాత్రలు చక్కగానిర్వర్తించారు. పాఠశాలకు చెందినదాదాపు 16మంది ఇతరవిద్యార్థులు ఉపాధ్యాయులుగాచాలా చక్కగా అభినయించి పలువురి మెప్పు పొందారు. ఈ కార్య క్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయులు దస్తయ్య, ఉపా ధ్యాయులు యాదయ్య, పద్మమ్మ, సాయి రమాదేవి, పద్మా వతి, నీరజ తదితరులు ఉపాధ్యాయులుగా రాణించిన విద్యార్థుల్ని అభినందించి వారికి తగిన ప్రోత్సాహకాలను అందించారు.

**దామరగిద్ద, మార్చి17 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలోని కేంద్ర ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణారెడ్డి, సర్పంచ్ కనికిరెడ్డి, ఉప సర్పంచ్ సతి సత్యనారాయణ, వార్డు సభ్యులు, జిహెచ్ ఎంసురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందు జమాన్, ఉపాధ్యాయులు ఉషనప్ప పాల్గొన్నారు. వారు విద్యార్థుల ప్రతిభను అభినందించి, ఇలాంటి కార్యక్రమాలు వారి నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని పేర్కొన్నారు.



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

## ఎల్‌పిజి సిలిండర్..

సరఫరా ఫిర్యాదులపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు

◆ రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరి ప్రియ

**మహబూబ్‌నగర్, మార్చి17 ప్రభాతవార్త:** మధ్య ప్రాచ్య సంక్షోభం కారణంగా జిల్లాలో ఎల్‌పిజి సిలిండర్ నిరంతర సరఫరా, బ్లాక్ మార్కెట్ నియంత్రణకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి. హరిప్రియ తెలిపారు. హోటళ్ళు, టీ స్టాల్ లు, రెస్టారెంట్ లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లలో డొమెస్టిక్ సిలిండర్ లను అక్రమంగా నిల్వ ఉంచడంపై ఫిర్యాదులు, సమస్యలు కంట్రోల్ రూమ్ కు తెలుప వచ్చని ఆమె తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా గృహ వినియోగ సిలిండర్లను హోటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాల్లో అక్రమంగా వినియోగించడం, నిల్వ చేయడం వంటి అంశాలపై ఫిర్యాదులు స్వీకరించి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంట్రోల్ రూమ్ లో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్ దేవేందర్‌రెడ్డి (ఫోన్: 9666052780), జిల్లా సివిల్ సప్లైస్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ అబ్దుల్ జలీల్ (ఫోన్: 9912659005)లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చుని, కంట్రోల్ రూమ్ ద్వారా అందిన ఫిర్యాదులు, సమస్యలను తేదీ వారీగా పూర్తి వివరాలతో రిజిస్టర్‌లో నమోదు చేసి, ఫిర్యాదులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమయానికి పరిష్కరించేలాచర్యలు తీసుకుంటారని ఆమె ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

**చిన్న చింతకుంట, మార్చి17 ప్రభాతవార్త:** యాసంగి రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్ ఖన్నా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 28 నాటికి కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకం గల రైతులు ఈ యాసంగి రైతు భరోసాకు అర్హులన్నారు. ఈ రైతు భరోసా కు పట్టాదారు పాసుపుస్తకం లేదా డిజిటల్ సంతకంతో కూడిన రిజిస్టర్ డాక్యుమెంట్ల జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు సేవింగ్ ఖాతా జిరాక్స్ కాపీలతో పాటు పూర్తి వివరాలతో నింపిన దరఖాస్తు పత్రాన్ని స్థానిక రైతువేదికలలో ఉన్న మండల విస్తరణ అధికారులకు అందజేయాలని ఏవోతెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతు ఈనెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలనిఆయన సూచించారు యాసంగి రైతు భరోసాని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రంజాన్ తోఫా పంపిణీ

**దామరగిద్ద, మార్చి17 ప్రభాతవార్త :** నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు దామరగిద్ద మండల కేంద్రంలో మంగళవారం రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దామరగిద్ద సర్పంచ్ కనికి రెడ్డి, జీపీవో యాదయ్య పాల్గొని లబ్ధిదారులకు తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనికిరెడ్డి మాట్లాడుతూ, పేదముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ తోఫాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ముస్లిం సోదరులందరికీ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాజా మియా, మైనారిటీ నాయకులు మునీర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మండల నాయకులు వెంకట్ రామ్‌రెడ్డి, తమ్మలి రఘు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై బీజేపీ ధర్నా

**దామరగిద్ద, మార్చి17 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలో ఈరోజు ప్రజా సమస్యల పరిష్కారం మరియు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మండల శాఖ ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ నినాదాలు చేశారు. అనంతరం తహసిల్దార్‌కు వినతిపత్రాన్ని సమర్పించి, ప్రజలకు సంబంధించిన పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ, సమస్యలు పరిష్కారం కానట్లయితే భవిష్యత్తులో మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంజీవ్ గౌడ్, సీనియర్ నాయకులు గోపాలరావు, చంద్రశేఖర్ రెడ్డి, సత్తి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి అంజయ్య గౌడ్, మంగలి నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి వెంకటయ్య, రామాలింగప్ప, కె. మోనేష్, అబ్దుల్ నబి, రాజశేఖర్‌గౌడ్, సాయిలు, వెంకటరాములుగౌడ్, పకీరప్ప, రాధాకృష్ణ తదితరులు దామరగిద్ద మండల బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకున్న వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్

**వడ్డేపల్లి, మార్చి 17 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రసిద్ధిగాంచిన జమ్ములమ్మ అమ్మవారిని వడ్డేపల్లి మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ కుటుంబ సమేతంగా భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీ పురేందర్ చైర్మన్‌ని సన్మానించారు. ఆలయ విశేషాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి చైర్మన్‌కి వివరించారు. చైర్మన్ ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో నాయకి బీచుపల్లి కుటుంబసభ్యులు, స్థానిక భక్తులు కూడా పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సన్‌రైజ్‌గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం

**భూత్పూర్, మార్చి17, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లోని సన్‌రైజ్‌గ్లోబల్ స్కూల్ పదో వార్షికోత్సవం మంగళవారం ఎంతో ఘనంగా జరిగింది. వార్షికోత్సవంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్య, డాన్స్ కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మణ్ హాజరై వార్షికోత్సవంలో ముఖ్య ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా స్వల్పపాటి ఫీజులతో పాఠశాల కరస్పాండెంట్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ సుమలత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం బడ్జెట్ స్కూల్స్ పలు ఇబ్బంధులెదుర్కొంటున్నాయని, బడ్జెట్ స్కూల్స్‌ను ఆదుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు గొడుగు వెంకటయ్య(ఠాగూర్ మెమోరియల్ స్కూల్), వెంకట్ క్రాంతికుమార్(న్యూ ఎరా హైస్కూల్)లతో పాటు విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

**వెల్దండ, మార్చి17 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని 2025-26 ఆర్థిక సంవత్సరానికి అర్హులైన షెడ్యూల్ కులాల అభ్యర్థులు ఓబి ఎంఎంఎస్ ద్వారా సమీప మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలానికి కేటాయించిన టువీలర్ వరకు 90శాతం సబ్సిడీ త్రీవీలర్ కొరకుమూడు యూనిట్లు 70 సబ్సిడీ ఉన్నదని వ్యవసాయం అనుబంధం కానీ అభ్యర్థులు జూలై ఒకటవ తేదీ నాటికి 21 నుండి 50సంవత్సరాల మధ్య వయసు వారై ఉండాలి వ్యవసాయ అనుబంధం పథకం కొరకు దరఖాస్తు అభ్యర్థులు జూలై 1వ తేదీ నాటికి 21..60సంవత్సర మధ్యవయసు వారై ఉండాలి మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని చేసు కోవాలని దరఖాస్తు చివరి తేదీ ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

## విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత


ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త:** పెన్నుతో పాటు ఇప్పుడు కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ప్రతి విద్యార్థికి శక్తివంతమైన ఆయుధమని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి విద్యార్థికి ల్యాప్‌టాప్ పంపిణీ చేశారు. తాడూరు మండలం పర్వతాయపల్లి గ్రామానికి చెందిన సాంబ కవిత, ఇబ్రహీంపట్నం లోని శ్రీ దత్త గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో బి.టెక్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను ఎమ్మెల్యే ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులుతమ భవిష్యత్తును మరింత మెరుగు పరుచుకోవాలని, కుటుంబా నికి మరియునియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

## అమెరికా భారత్ వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయండి

**అయిజ మార్చి17, ప్రభాతవార్త;** కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న అమెరికా భారతీయ వ్యవసాయ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని మంగళవారం పట్టణంలోని మండల సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక నిర్ణయాలలో భాగంగా అమెరికాతో వాణిజ్యఒప్పందాన్ని చేసుకొని వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి జీరో పన్నును చేసి మన రైతాంగాన్ని తీవ్రంగా నష్ట పరుస్తున్నారని, రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేకమైనటువంటి నిర్ణయాలైన 2025 విద్యుత్ సవరణ బిల్లును, విత్తన బిల్లును, విబి జీ రాంజీ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 29 కార్మిక చట్టాలను తీసివేసి నాలుగు కోడ్లుగా మార్చి కార్మిక వ్యతిరేక నిర్ణయాలను ఉపసంహరించి, యధావిధి కార్మిక చట్టాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్,టిపిఎఫ్ రాష్ట్రఉపాధ్యక్షుడు సంకరప్రభాకర్, సిఎల్సి విజయభాస్కర్, రైతులు జి. ఉమామహేశ్వర్, ఆర్ మైనర్ బాబు, శివప్రసాద్, భాస్కర్, చిన్న బుజ్జి, తదితర రైతులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

**వెల్దండ, మార్చి 17 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగామండలంలోని కుప్పగండ్లచౌదర్‌పల్లి గ్రామాలను సందర్శించి పారిశుద్ధ్య నిర్వహణ త్రాగునీటి నిర్వహణ నర్సరీల నిర్వహణ ఉపాధి హామీ పనుల నిర్వహణపై సంబంధిత పంచాయతీ కార్యదర్శులు గ్రామ సర్పంచ్‌లను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం దృష్టా సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నిచర్యలు తీసుకోవాలని ప్రారంభించుటకు అని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చౌదర్‌పల్లి సర్పంచ్ సుంకిరెడ్డి కృష్ణారెడ్డి, పంచాయతీ అధికారి లక్ష్మణ్, ఏపీవో ఈశ్వర్ జి, పంచాయతీ కార్యదర్శి మంజుల, హాజీ బాబా తోపాటు తదితరులు ఉన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన


సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

**జడ్చర్ల, మార్చి17 ప్రభాతవార్త:** జడ్చర్ల మండలం లింగంపేట్ గ్రామ పంచాయతీ పరిధిలో ఎంపీ డీకే అరుణమ్మ నిధుల ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద గ్రామంలో సీసీ రోడ్డు పనులు మంజూరు కాగా మంగళవారం బీజేపీ నాయకులు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిజెపి మండల అధ్యక్షుడు యాట రామకృష్ణ ముదిరాజ్, బిజెపి ప్రధాన కార్యదర్శి ఎడ్లశ్రీనివాస్‌గౌడ్, బిజెపి మండల ఉపాధ్యక్షుడు మహేష్ యాదవ్, ఓబిసి మండలఅధ్యక్షుడు శివకుమార్‌యాదవ్ గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, బిజెపి మండల కార్యదర్శి జగదీశ్వర్ బిజెపి మండల సీనియర్ నాయకులు రమేష్ జి, గ్రామ బిజెపి నాయకులు పవన్, సర్పంచ్ రామనోళ్ళబాలస్వామి,ఉపసర్పంచ్‌గోపీనాయక్,వార్డ్‌మెంబర్‌లు పాల్గొన్నారు.

## ధన్వాడలో రంజాన్ తోఫా పంపిణీ

**ధన్వాడ, మార్చి 17 ప్రభాతవార్త:** రంజాన్ పండుగను పురస్కరించుకుని ధన్వాడ మండల కేంద్రంలోమంగళవారం పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పర్ణికరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టారు.ఈ సందర్భంగా నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివా రెడ్డి, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవరెడ్డి, నారాయణపేట ఉపాధ్యక్షుడు గాజుల శివకుమార్, డైరెక్టర్ లక్ష్మయ్య గౌడ్, ధన్వాడ మండల అధ్యక్షుడు నరహరి,ఉపసర్పంచ్ పూజారి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.పండుగను ఆనందంగా జరుపుకునేందుకు ఆర్థికంగా వెనుకబడిన ముస్లిం కుటుంబాలకు అవసరమైన సరుకులతో కూడిన తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,పేదలందరూ సంతోషంగా రంజాన్ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

## కారు బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

**వెల్దండ, మార్చి 17 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల నారాయణపూర్ గేట్ వద్ద కారు-బొలెరో ఎదురెదురుగా ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న తలసాని గిరిధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన తలసాని గిరిధర్‌రెడ్డి హైదరాబాదు నుండి సొంత గ్రామానికి కారులో వస్తుండగా సంగారెడ్డి జిల్లా సూరారం గ్రామానికి చెందిన మహేష్ బొలెరో వాహనంలో అచ్చంపేటనుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా నారాయణపూర్ గేటు వద్ద కారు-బొలెరో ఎదురెదురుగా ఢీకొనడంతో తలసాని గిరిధర్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. బొలెరోలో ఉన్న డ్రైవర్‌తో పాటు మరొకరికి గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## హనుమాన్ మాలధారణతోనే ముక్తి మార్గం

**నారాయణపేట, మార్చి 17 ప్రభాతవార్త :** హనుమాన్ మాలధారణ ద్వారానే ముక్తికి మార్గం లభిస్తుందని గురుస్వామి శరణప్ప చారి పేర్కొన్నారు. భక్తి భావంతోనే భగవంతునికి చేరువకోవచ్చని తెలిపారు. శ్రీరామ భక్తుడు హనుమాన్ నామస్మరణ అత్యంత శక్తివంతమైందని ఆయన అన్నారు. స్వామిని భక్తితో ఆరాధించిన వారికి సకల కోరికలు నెరవేరుతాయని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సాయి విజయ కాలనీలో గల హనుమాన్ దేవాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. మొత్తం 38 మంది భక్తులు 41 రోజుల హనుమాన్ మాలధారణ దీక్షను చేపట్టి కొనసాగిస్తున్నారు. దీక్షను నియమ నిష్ఠలతో ఆచరిస్తున్నట్లు తెలిపారు దీక్ష పూర్తయ్యిన అనంతరం కిష్కింధ హనుమాన్ దేవాలయానికి వెళ్లి స్వామివారికి ఇరుముడి సమర్పించనున్నట్లు భక్తులు తెలిపారు.భక్తుల్లో భక్తి భావం, ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది.


హనుమాన్ మాల ధారణ చేసిన భక్తులు

# ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డి.సునీతరెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ రహదారులపై రోడ్డు ప్రమాదాలు నివారించడానికి చేపట్టాల్సిన మౌలిక వసతులను గుర్తించి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పోలీసు, జాతీయ రహదారుల విభాగం, మున్సిపాలిటీ, పీఆర్ తదితర శాఖల అధికారులతో రహదారి భద్రత జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో పాటు జిల్లా ఎస్పీ డి.సునీతరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ గత సమావేశంలో కమిటి దృష్టికి వచ్చిన అంశాలు ఇచ్చిన ఆదేశాలు ఎంతవరకు అమలు అయ్యాయో అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారిపై గుర్తించిన బ్లాక్ స్పాట్ ప్రాంతాలు వెల్టూర్ జంక్షన్, మదర్ థెరిసా జంక్షన్, పాలెం బ్రిడ్జి, పెబ్బేర్ బైపాస్ రోడ్డు, విలియం కొండ, రంగాపూర్ తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యల పై ఇచ్చిన సూచనలు ఎంతవరకు పూర్తి చేశారని జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అందుకు వారు సమాధానం ఇస్తూ జిల్లా కమిటీ సూచనల మార్కు బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయడం, హైమాస్ట్ లైట్లు, బ్లింకింగ్ లైట్లు,రంబుల్ స్ట్రిప్ ఏర్పాట్లు చేయడం జరిగిందని కమిటి దృష్టికి తెచ్చారు.విలియంకొండ వద్ద అనధికారిక యుటర్న్‌ను మూసివేయడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారుల పనితీరును అభినందించారు. అన్ని చర్యలు చేపట్టినప్పటికీ ప్రమాదాలుజరుగుతున్నాయని వాటికి గల సూక్ష్మ కారణాలను అన్వేషించాలని ఇంజనీర్లను సూచించారు. రోడ్డు ప్రమాదాలు నివారించే క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న భద్రత పరమైనఅంశాలపై మరింతగా దృష్టి సారించాలని ఆదేశించారు. అవసరమైన చోట అండర్ పాస్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని, అనవసరపు యు టర్న్‌లను తగ్గించాలని సూచించారు. అదేవిధంగా జాతీయ రహదారులపై రాంగ్ రూట్లో వచ్చే వారిని కట్టడి చేయాలని సూచించారు. వనపర్తి పట్టణంలో అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వెళ్లే ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్లపై ప్రమాదాలుజరుగకుండా ఉండేందుకు సంబంధిత పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చేపట్టాల్సిన చర్యల పై కమిటీకి ప్రతిపాదనలు సిఫారసు చేయాలని సూచించారు. ప్రస్తుతం పోలీస్ అధికారులు సిఫారసు చేస్తున్న ప్రతిపాదనలను వచ్చే కమిటీ సమావేశం నాటికి పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు,మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. మదనపూర్ వంతెన పనులను వర్షాకాలము ప్రారంభం అయ్యే నాటికిపనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

**ట్రాఫిక్ రూల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి :** జిల్లాలో రవాణా, పోలీసు శాఖ అధికారులు ట్రాఫిక్ రూల్స్ అమలుపై పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అధిక లోడుతో ప్రయాణించే ఆటో రిక్షాలు, బైక్ లపై ముగ్గురు ప్రయాణించే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ డి.సునీత రెడ్డి సైతం రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన పలు చర్యలపై సూచనలు చేసారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎన్. ఖీమ్యా నాయక్, డి.ఎస్.పి వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ అధికారి దేశ్యా నాయక్, డిసిఆర్‌బి డిఎస్పీ బాలాజీ నాయక్, ఆర్టీవో మమత, ఎస్సైలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి


డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

**మహబూబ్‌నగర్ క్రైమ్, మార్చి 17 ప్రభాతవార్త:** ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా శాంతి భద్రతలు భంగం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, సబ్‌ఇన్‌స్పెక్టర్ సీనయ్య పోలీస్ సిబ్బంది కలిసి ముఖ్య ప్రాంతాల్లో కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా వన్‌టౌన్ పరిధిలోని క్లాక్ టవర్ చౌరస్తా, మసీదులు, ట్యాంక్ బండ్ ప్రాంతం ఇతర ముఖ్య కూడళ్ల వద్ద డాగ్ స్క్వాడ్ సహాయంతో అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులపై తనిఖీలు నిర్వహించారు. ప్రజలు పండుగలను ప్రశాంతంగా జరుపుకునే విధంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ అప్రమత్తంగా చర్యలుతీసుకుంటోంది.ఈ సందర్భంగా వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య మాట్లాడుతూ ఉగాది రంజాన్ పండుగల నేపథ్యంలో శాంతి భద్రతలదృష్ట్యా ముందస్తుగా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తుందని తెలిపారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు


ముస్లిం సోదరులకు తోఫా అందజేస్తున్న దృశ్యం

**దేవరకద్ర,మార్చి 17 ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును జిల్లా ప్రధాన కార్యదర్శి వై. కిషన్ రావు ఏర్పాటు చేశారు. మంగళవారం కౌకుంట్ల మండల కేంద్రంలోని జామియా మసీదులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి, ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులతో కలిసి, ఉపవాస విరమణ చేసి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రధాన కార్యదర్శి వై.కిషన్ రావు మాట్లాడుతూ రంజాన్ మాసం సోదరభావం, సహనం,పరస్పర గౌరవం,సేవా భావాన్ని పెంపొందించే పవిత్ర కాలమని పేర్కొన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సఖ్యతతో జీవించాలని సందేశాన్ని రంజాన్ పండుగ ఇస్తుందని అన్నారు. తదనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్ కు, ఇఫ్తార్ విందు ఇచ్చిన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావుకు, ఉప సర్పంచ్ లక్ష్మీకాంతరావుకు, వార్డ్ మెంబర్ రవీందర్‌రెడ్డికి, ముస్లిం సోదరులు సాల్వతో ఘనంగా సన్మానించారు. తదనంతరం


ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన దృశ్యం

ఖురాన్ కంఠస్థం చేసిన హిమాం,మోజాన్లకు, రంజాన్ తోఫా, దుస్తులను పంపిణీ చేసి, శాలువాతో సల్వా తో సత్కరించిన కిషన్ రావు. ఈ కార్యక్రమంలో ఓబిసి అధ్యక్షులు ఆంజనేయులు, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు కొండన్న, తుమ్మల నరసింహారెడ్డి, ప్రభు , వడ్ల సురేంద్ర చారి, మన్నెపు రెడ్డి,ముస్లిం సోదరులు షబ్బీర్ అలీ, ఒలియుద్దీన్, అమీర్ జానీ, ఎండి షఫీ,నిస్సార్, సలాంపాషా, జానీ,రహీంభాయ్, యూసుఫ్ పాల్గొన్నారు.

**మద్దూరు, మార్చి 17 ప్రభాతవార్త:** మద్దూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మైనార్టీ సోదరులకు మంగళవారం రోజు షా గార్డెన్ నందు ప్రత్యేక ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. షా గార్డెన్ నందు ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మైనార్టీ సోదరులలతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరసింహులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ముద్ది బీమప్ప,మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి, మాజీ ఆప్షన్ ఇబ్రహీం,పార్టీ సీనియర్ నాయకులు కునే సంజీవ్, రమేష్ రెడ్డి,జంగం బాబు, హన్మిరెడ్డి, కౌన్సిలర్లు గడ్డమీది గోవిందు, మైముద్, సంజీవ్, కాంగ్రెస్ నాయకులు ఐటిఐ రాజు, జనార్ధన్, బాలరాజ్, ప్రకాష్, చందు, నరసింహులు గౌడ్, పల్లె గడ్డ వెంకట్, హజరత్ సబ్, ఉస్మాన్, చాంద్ పాషా, యాసీన్, సలాం, వివిధ శాఖ అధికారులు తహశీల్దార్లు మహేష్ గౌడ్, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**నారాయణపేట, మార్చి17 ప్రభాతవార్త:** నారాయణపేట, మరికల్, ధన్వాడ మండలాల్లో కళ్యాణలక్ష్మి ్మ, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారుల కు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి,మాజీ డీసీసీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి ఆదేశా లతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఏఎంసీ చైర్మన్ రాంపురంశివారెడ్డి, ఎమ్మెల్యేవ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు ఈ సందర్భంగావారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకాల ద్వారా పెద్ద ఎత్తున సహాయం అందజేస్తోందని తెలిపారు. వివాహ ఖర్చులను తగ్గించేందుకు ఈ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. పేట మండలంలోని 149 మంది లబ్ధిదారులకు జాజాపూర్ రైతువేదికలో చెక్కులు అందజేశారు. మరికల్ మండలానికి చెందిన 40 మంది, ధన్వాడ మండలానికి చెందిన 38 మంది లబ్ధిదారులకు మరికల్ కేంద్రంలోని సూర్యచంద్ర ఫంక్షన్ హాల్‌లో చెక్కులను పంపిణీచేశారు.ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధుసూదన శర్మకు ధర్మనిధి పురస్కారం

**కొల్లాపూర్, మార్చి 17 ప్రభాతవార్త :** తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో తిరుకొవలూరు శ్రీలక్ష్మి పేరిట నిర్వహిస్తున్న ధర్మనిధి పురస్కారాన్ని కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన వేదార్థం మధుసూదన శర్మకు శనివారం ప్రధానం చేశారు. తెలుగు భాషా ఉపాధ్యాయునిగా, కవిగా, రచయితగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా, తెలుగు భారతి సంస్థ ప్రధాన కార్యదర్శిగా వారు చేస్తున్న సాహితీ కృషిని గుర్తించి తెలంగాణ సారస్వత పరిషత్ ఆవరణలోని దేవులపల్లి రామానుజ రావు కళామందిరంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్ .రామ్ చందర్ రావు,పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరిశివారెడ్డి, కార్యదర్శి డా.జె.చెన్నయ్య తదితరులు అందజేశారు.ఈ అవార్డు రావడం తనకు ఎంతో గర్వంగా ఉందని, తనపై మరింతబాధ్యత పెరిగిందని,ఆ దిశగా ముందుకు సాగుతాననీ మధుసూదన శర్మఅన్నారు.తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన పరిషత్ అధ్యక్ష,కార్యదర్శులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో షబేఖద్దర్ వేడుకలు

**దేవరకద్ర,మార్చి 17 ప్రభాతవార్త:** కౌకుంట్ల ,దేవరకద్ర మండలాలలోని మసీదులలో సోమవారం రాత్రి ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో షబేఖద్దర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని నవరాత్రుల్లో ఏదైనా ఒక రోజు రాత్రి ముస్లిం సోదరులు షబ్బీ ఖతర్ వేడుకలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా సోమవారం రాత్రి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని మసీదులలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో షబేఖదర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా మౌలానా హాజీ హలీం, మహమ్మద్ ఆరిఫ్,భక్తి సందేశలను అందించారు. షబే ఖాదర్ రోజు రాత్రి చేయవలసిన ప్రార్థన తదితర అంశాలపై ముస్లిం సోదరులకు అవగాహన కల్పించారు. రంజాన్ యొక్క విశిష్టత నియమ నిబంధనలో అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు షబ్బీర్ అలీ, ఫజల్ రెహమాన్, షఫీ, సలాం పాషా, రెహమాన్, జానీ భాయ్, సమీర్,పట్టణంలోని ముస్లిం సోదరులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

**శ్రీరంగాపూర్, మార్చి 17 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని పీఎం శ్రీరంగాపూర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది.ప్రధానోపాధ్యాయురాలిగా రిషిత మండల విద్యాధికారిగా భువనేశ్వర్ జిల్లా విద్యాధికారిగా జస్వంత్ బాధ్యతలను స్వీకరించారు. అత్యుత్తమ బోధన చేసిన వారికి ప్రథమ బహుమతి పావనికి ద్వితీయ బహుమతి హేమలతకి తృతీయ బహుమతి భానుకి ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ మల్లేశ్వరి, మండల విద్యాధికారి టి.హనుమంతు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, వార్డ్ మెంబర్ భాస్కర్, మాజీ ఎంపిటిసి ఎల్ల స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీహరి రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ రాజు, ఉపాధ్యాయులు వసంతపురం రాజు, దామోదర్, సమీన్ బేగం, బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తస్లీమ్ బేగం, ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు శ్రీరంగాపూర్, పెబ్బేరు మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## మెనూను వంద శాతం అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

జాబితా సిద్ధం చేయాలని తెలిపారు. వసతి గృహాల్లో భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా బాలికల హాస్టళ్లలో అనుమతి లేని వారిని అనుమతించరాదన్నారు.ఆర్‌బీఎస్‌కే బృందాలు వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. పదో తరగతి పరీక్షలను సజావుగా నిర్వహిస్తూ కేంద్రాల్లో సెల్‌ఫోన్లకు నిషేధం అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీఈఓ గోవిందరాజులు, ఎస్సీ అభివృద్ధి శాఖ ఈడీ అబ్దుల్ ఖలీల్,మైనారిటీసంక్షేమ అధికారి ఎం.ఏ.రషీద్, పౌరసర ఫరాల అధికారి బాల్‌రాజ్, జీసీడీవోసంగీత, ఏఎంఓ విద్యాసాగర్ పాల్గొన్నారు.

## కొండారెడ్డిపల్లి పనులపై ఫోకస్ పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని రానున్న వేసవికాలం సెలవుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.అంగన్వాడి నూతన భవన నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.బ్యాంక్ భవనానికి ఆధునిక పనులను పూర్తి చేయాలన్నారు.గ్రామంలో ఇదివరకే మంజూరై నిర్మాణాల్లో ఉన్న పనులన్నీ రానున్న 2 మాసాల్లో పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు.పనుల్లో ఏమన్నా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని,వాటిని అధికారికంగా పరిష్కరించుకొని, పనులను అత్యంత నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్,జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం,ఈఈ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విజయ్ కుమార్, డిపిఓ శ్రీరాములు, సిపిఓ సుజాత,వంగూర్ తాహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మర తనిఖీలు..

(మొదటి పేజీ తరువాయి)

మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడంతో సుమారు 100 సిలిండర్ల వరకు పట్టుబడ్డాయి.

**అడ్డాకులలో తనిఖీలు:** జిల్లాలో గృహ అవసరాలకు సంబంధించిన వంట గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగం, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు జిల్లా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టారు.ఈ చర్యల్లో భాగంగా జిల్లా పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ తనిఖీల సందర్భంగా అడ్డాకల్, మూసాపేట పోలీస్ స్టేషన్ పరిధుల్లో గృహ వినియోగానికి కేటాయించిన గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా ఉపయోగిస్తున్నట్లు గుర్తించి,మొత్తం 10 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ తెలిపారు. స్వాధీనం చేసిన సిలిండర్లను అడ్డాకల్ లో మా బాలాజీ భారత్ గ్యాస్ గ్రామీణ వితరణ కేంద్రానికి భద్రపరిచేందుకు అప్పగించారు.జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## గద్వాలలో విషాద ఛాయలు

(మొదటి పేజీ తరువాయి)

మిగతా ఇద్దరు విద్యార్థులు, మిట్టదొడ్డి గ్రామానికి చెందిన విష్ణు (17) కోమాలకు వెళ్లినట్లు సమాచారం.గంజిపేటకు చెందిన వర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం108 అంబులెన్స్ ద్వారా గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. సెలవుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన సమయంలో ఈ విషాదం చోటుచేసుకోవడంతో ఆయా కుటుంబాల్లో తీరనిశోకం మిగిలింది. మృతిని కుటుంబానికి న్యాయం చేయాలనీ రాస్తారోకో....ఈ ప్రమాదంలో ఐజ పట్టణానికి చెందిన విద్యార్థి రాము మృతి చెందాగా అతని కుటుంబానికి న్యాయం చేయాలనీ మృతుని కూటింబీకులు, గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. ప్రమాదం అనంతరం జిల్లా కేంద్రంలోని గల ప్రభుత్వ ఆసుపత్రి ముందు చౌరస్తాలో రోడ్డు పై బైటయించి రాస్తారోకో చేశారు.దీంతో పలు వాహనాలు రోడ్డు పై నిలిచి ట్రాఫిక్ అంతరాయము కలిగింది. ప్రధాన రహదారిపై వాహనాలు బారులు తీరాయి.

## స్వయం ఉపాధి అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయ పరిమితి 2160 సంవత్సరాల మధ్య కుటుంబ ఆదాయం గ్రామీణప్రాంతాల్లో రూ.1.50లక్షల వరకు,పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షల వరకు ఉండాలని. అభ్యర్థులు తప్పనిసరిగా రేషన్ కార్డు (ఎఫ్ ఎస్‌సి కార్డు),కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు,బ్యాంక్ ఖాతావివరాలను సమర్పించాలని పేర్కొన్నారు. బిపిఎల్‌కు చెందిన అభ్యర్థులకు ప్రాధాన్యత నివ్వడం జరుగుతుందని, కావున అర్హులైన అభ్యర్థులు షెడ్యూల్డ్ కులాల సహకార సేవా సంఘం ( ఎస్.సి కార్పొరేషన్)టిజిఓబిఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ హెచ్‌టిటిపిఎస్// టిజిఓబిఎంఎంఎస్‌న్యూ.సిజిజి.జిఓవి.ఇన్‌ద్వారా దరఖాస్తులు చేసుకోవలెను.దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ: మార్చి 24 వ తేదీ అని,ఇతర వివరాలకు జిల్లా షెడ్యూల్డ్ కులాలసహకార సేవా సంఘం కార్యాలయం,రూమ్‌నం.105, మొదటి అంతస్తు,కలెక్టర్ కార్యాలయం (ఐడిఓసి) , మహబూబ్‌నగర్ సంప్రదించగలరని, మొబైల్ నంబర్ 984990 5996 సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ సి.శ్రీకాంత్

**మద్దూరు, మార్చి17 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా ఇటీవల నియమితులైన ప్రతీక్ జైన్‌ను మద్దూరు మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ మర్యాదపూర్వకంగాకలిసి శుభాకాంక్షలు తెలిపారు.మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పట్టణ సమస్యలపై కలెక్టర్‌తో చర్చించారు. భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై కలెక్టర్ సూచనలు అందించినట్లు కమిషనర్ తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ

**ఉప్పునుంతల, మార్చి17 ప్రభాతవార్త:** 2025,26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎస్సి కార్పొరేషన్ నాగర్ కర్నూల్ వారి ఆదేశాల మేరకు అర్హులైన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు ద్వారా సమీప మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం కల్పించడం జరిగిందని ఎంపిడిఓ రేవత్ రెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి ఈ కింది విధంగా అర్హతలుకలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయ అనుబంధం కాని అభ్యర్థులు జూలై 1వ తేదీ నాటికి 21నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు వారై ఉండాలని,వ్యవసాయ అనుబంధ పథకం కొరకు దరఖాస్తు చేయు అభ్యర్థులు జూలై 1 వ తేది నాటికి 2160సంవత్సరాల మధ్య వయసు వారై ఉండాలని వివరించారు. సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ కొరకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం కొరకు 18నుంచి 45 మధ్య వయసు వారై ఉండాలని కోరారు. అదే విధంగా ఆధార్ కార్డు,రేషన్ కార్డులేదా ఫుడ్ సెక్యూరిటీ కార్డు .కుల, ఆదాయ సర్టిఫికెట్లను జతపరచాలని వివరించారు.పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్ ,సదరం సర్టిఫికెట్ ,పాస్ పోర్టు సైజ్ ఫోటోలు జత పరుస్తూ ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

## ఉగాది సందర్భంగా ఎద్దుల బిర్రు బండి పోటీలు

**దామరగిద్ద, మార్చి 17 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం ఏల్సన్‌పల్లి గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా ఎద్దుల బిర్రు బండి పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ పోటీల్లో ప్రాంతీయ రైతులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా రూ.10,000/ వద్వట్ గ్రామానికి చెందిన రంగప్పగెలుచుకోగా,రెండవ బహుమతి రూ.5,000/ లోకపల్లిరాజు అందుకున్నారు.మూడవబహుమతి రూ.3,000/ ఉంద్యాల రవి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో దామరగిద్ద పుట్టి ఈదప్ప, గ్రామ సర్పంచ్ పటేల్ శ్రీధర్, మాణిక్యప్ప, బస్వరాజ్, జనార్దన్ రెడ్డి, సాయప్ప, రవి, కాశి, సుదర్శన్, గణేష్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.ఈ పోటీలు గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు.